10 ఊళ్ల జనం.. ఏళ్ల రణం

- దాసార్లపల్లి బస్సు కోసం దశాబ్దపోరు
- డయల్ యువర్ డీఎంలోనూ వినతులు
- నిరీక్షిస్తున్న పది గ్రామాల ప్రజలు




గతంలో పలమనేరు - దాసార్లపల్లి బస్సు(ఫైల్)

పలమనేరు: పది గ్రామాల ప్రజలు ఒక బస్సుకోసం దశాబ్దంగా ఆర్టీసీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వారు పట్టించుకోకపోవడంతో ఆర్టీసీ ఉన్నతాధికారులకు వినతులు పంపారు. అంతేకాదు స్థానికంగా ఏ పార్టీ ఎమ్మెల్యేలున్నా తమ సమస్యను పరిష్కరించాలంటూ ఎన్నో ఏళ్లుగా వేడుకుంటూనే ఉన్నా ఎవరూ కనికరించలేదు. ఇప్పటికైనా పలమనేరు నుంచి దాసార్లపల్లి ఆర్డినరీ బస్సును నడపాలని ఇటీవల జరిగిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలోనూ పది గ్రామాల ప్రజలు విన్నవించుకున్నారు.

దాసార్లపల్లి బస్సు చాలా ముఖ్యం

పలమనేరు డిపో ప్రారంభమైనప్పటి నుంచి పలమనేరు నుంచి బైరెడ్డిపల్లి, తీర్థం మీదుగా దాసార్లపల్లి పది ట్రిప్పులు తిరిగేది. దీంతో ఈ ప్రాంతంలోని పది గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉండేది. దాసార్లపల్లి గ్రామం నుంచి ఓ అడుగు పక్కన పెడితే కర్ణాటకలోని బయప్పల్లి వస్తుంది. రాష్ట్ర సరిహద్దులోని ఈ గ్రామానికి బస్సు గతంలో నడిచేది. కొన్నేళ్ల క్రితం ప్రయాణికులు తగ్గారనే సాకుతో ఈపీకేఎల్(ఎర్నింగ్ పర్ కిలోమీటర్ ఆపరేషన్) పేరుతో ఈ సర్వీసును ఆపేశారు. ఆపై గ్రామస్తుల నిరసనల నడుమ కొన్నాళ్ల పొద్దున, రాత్రిలో ఈ రూట్‌లో ఆఖరి సర్వీసుగా నడిపారు. పలమనేరు పట్టణంలో పలు రకాల పనులు చేసుకొని గ్రామాలకు వెళ్లేవారికి దాసార్లపల్లి ఆఖరి సర్వీసు అయినందున రాత్రుల్లో ఎంతో సౌకర్యంగా ఉండేది. ఆపై దీన్ని సైతం ఆర్టీసీ అధికారులు ఆపేశారు. ప్రస్తుతం బైరెడ్డిపల్లి నుంచి దాసార్లపల్లికి మంచి తారు రోడ్డున్నా బస్సు సౌకర్యం మాత్రం లేదు. గతంలో ఉన్న ఓ ప్రైవేటు బస్సు ఇప్పుడు లేదు. దీంతో ఈ మార్గంలో ఆటోలు మినహా ప్రయాణానికి దిక్కు లేకుండా పోయింది.



1982లో ఈ బస్సుకోసం గ్రామస్తుల కరపత్రం

దశాబ్దాలుగా సాగుతున్న పోరు

ఇదే బస్సు 1982 ప్రాంతంలో ఐదు సింగిల్స్ నడుస్తుండగా దీన్ని మరో రెండు సింగిల్స్ పెంచాలని అప్పట్లో గ్రామ పంచాయతీ వారు కరపత్రాలను ముద్రించి పోరాటాలను చేసిన చరిత్ర ఈ బస్సుకుంది. అలాంటి సర్వీసును ఎనిమిదేళ్ల క్రితం ఆపేశారు. దీంతో అప్పటినుంచి అక్కడి పది గ్రామాలకు చెందిన వారు ఈ సర్వీసును నడపాలని పోరాటం చేస్తూనే ఉన్నారు. అయితే ఇప్పటికీ అది సాధ్యం కాకపోవడం కొసమెరుపు.

ఇది ఎన్నో ఏళ్ల పోరాటం



బైరెడ్డిపల్లి నుంచి కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే మార్గంలో తీర్థం గ్రామముంది. మంచి తారు రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు లేదు. దీంతో ఆటోలు, బైక్‌లపై మా చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లాలి. ముఖ్యంగా సీనియర్ సిటిజన్‌లైన మాకు బస్సు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. తాజాగా డయల్ యువర్ డీఎంలో చెప్పాం. ఫలితం శూన్యం.

– తీర్థం క్రిష్ణమూర్తి, మాజీ సర్పంచ్, తీర్థం

దాసార్లపల్లి సర్వీసును పరిశీలిస్తాం



ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్న మాట నిజమే. డయల్ యువర్ డీఎంలోనూ తీర్థంతో పాటు చట్టుపక్కల గ్రామస్తులు కాల్ చేసి సమస్యను తెలిపారు. దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొత్త బస్సులు డిపోకు రావాల్సి ఉంది. అవి వచ్చాక దాసార్లపల్లి సర్వీసును నడిపేందుకు తప్పకుండా పరిశీలిస్తాం.

–టీకే స్వామి, డిపో మేనేజర్, పలమనేరు

వ్యాధుల నియంత్రణకే పారిశుధ్య పనులు

పుంగనూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా తెలిపారు. ఎస్ఎస్.పేటలోని రాంనగర్ కాలనీలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించి, మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించారు. దోమల నివారణకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేశారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా రోజుకో ప్రాంతంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

పుంగనూరు: పట్టణంలోని నక్కబండ ప్రాంతంలో ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం కలుగుతుందని శుక్రవారం ట్రాన్స్‌కో ఏఈ ఉమామహేశ్వర రావు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మెయింటినెన్స్ కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. నక్కబండ, మర్రిమాకులపల్లె తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాన్ని గమనించి ప్రజలు సహకరించాలని కోరారు.

పలమనేరులో..

పలమనేరు: సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా నేడు పట్టణంతోపాటు, పలమనేరు మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని స్థానిక ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీన్ని గుర్తించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

అర్ధగిరికి లైట్ల విరాళం



అర్ధగిరి ఆలయ ఈఓ హనుమంతుకు లైట్లను అందజేస్తున్న దాత

చౌడేపల్లె: అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయానికి చౌడేపల్లె మండలం పరికిదొన సర్పంచ్ లక్ష్మీదేవి బాబు దంపతులు లైట్లను విరాళంగా శుక్రవారం అందజేశారు. ఫోకస్సింగ్ లైట్లను ఆలయ ఈఓ హనుమంతుకు అప్పగించారు. ఈఓ సూచనల మేరకు లైట్లు సమకూర్చినట్లు దాత పేర్కొన్నారు. అనంతరం ఆయన్ను ఈఓ సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట శెట్టిపేట సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, బోయకొండ ఆలయ మాజీ డైరెక్టర్ శంకరప్ప ఉన్నారు.

లోగో డిజైనింగ్ పోటీలు

కుప్పం: కుప్పం పర్యటన కేంద్రంగా లోగో డిజైనింగ్ పోటీలను కడా నిర్వహిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న ఈ లోగో పోటీల్లో గెలుపొందిన వారికి రూ.10 వేలు బహుమతిగా కడా ప్రకటించింది. ఈ నెల 17వ తేదీ లోపు డ్రాయింగ్, యాప్ ద్వారా లోగోను డిజైన్ చేసి కడా వాట్సాప్ నం– 9310814920, ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఈ మెయిల్ పంపవచ్చును. శివరాత్రి పర్వదినాన లోగోను ప్రకటించనున్నట్లు కడా అధికారులు వెల్లడించారు.

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థి ప్రతిభ



లక్ష్మీ నారాయణ

సదుం: జేఈఈ మెయిన్స్‌లో ఎంజేపీ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న లక్ష్మీ నారాయణ మంచి ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్సీ కేటగిరీలో 100 శాతానికి 77.98 శాతం పర్సంటైల్ స్కోర్ సాధించారని తెలిపారు. ఎన్ఐటీ కాళాశాలలో సీటు సాధించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఎస్సీ కేటగిరీలో అర్హత సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థి లక్ష్మీ నారాయణను అధ్యాపకులు అభినందించారు.

16న ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని స్థానిక ముడెప్ప సర్కిల్ సమీపంలో ఉన్న లీనార్డ్ హైస్కూల్లో ఈనెల 16న వారాహి గ్రూప్స్ ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహి ఆస్పత్రివారి సహకారంతో ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు వారాహి గ్రూప్స్ ఫౌండర్ హేమంత్ రాయల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో క్యాన్సర్‌తో పాటు గుండె, కిడ్నీ, డయాలసిస్ తదితర వాటికి చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు.

బోయకొండలో రాహుకాల అభిషేక పూజలు



బోయకొండలో ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధిచేశారు. రాహుకాల సమయంలో సంప్రదాయరీతిలో అర్చనలు, అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, పుష్పాలతో అమ్మవారిని ముస్తాబుచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో పవిత్ర తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలను అందించాలని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆస్పత్రి వైద్యులకు సూచించారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యంగా ఆస్పత్రిలో రోగులకు మంచినీటి సౌకర్యం, వసతులు బాగుండాలన్నారు. ఆస్పత్రి వద్ద రోగులు, సహాయకులకు అవసరమైన క్యాంటీన్ ఏర్పాటుపై చర్చించారు. ఇందులో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మమతారాణి, కమిటీ సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీల హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

గుడుపల్లె: ఎస్సీ ఎస్టీ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీతారాం పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్త్రీశక్తి భవనంలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను తెలియజేశారు. ఎస్సీలకు కేటాయించిన పథకాలను అర్హులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న పరిశీలకులు

పులిచెర్ల(కల్లూరు): వృత్తి విద్యా కోర్సులకు చెందిన విద్యార్థుల ప్రాక్టికల్స్ తనిఖీ చేయడానికి కల్లూరు హైస్కూలుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లోని శ్రీ పీఎం పాఠశాల పరిశీలన అధికారి వచ్చారు. పరిశీలన అధికారి అజిత్ మిస్త్రా శుక్రవారం హెచ్ఎం శ్రీవాణితో మాట్లాడారు. విద్యార్థులు తయారు చేసిన పోర్ట్‌ఫోలియో వైవాను పరిశీలించారు. వాటిని పీఎం శ్రీ కార్యాలయానికి పంపనున్నారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా బోధన ఉపాధ్యాయులు వెంకట సిద్దులు, రాజేంద్ర, వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విశిష్ట సంఖ్య తప్పనిసరి





పులిచెర్ల: ఆర్ఎస్‌కేను తనిఖీ చేస్తున్న ఏడీ శివశంకర్, వి.కోట: ర్యాలీలో రైతులు, వ్యవసాయ అధికారులు

వి.కోట: రైతులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి అందే ఎటువంటి పథకానికైనా రైతు విశిష్ట సంఖ్యను కలిగి ఉండాలని దీన్ని వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని సూచించారు. ఆమె మండలంలోని గోనుమాకులపల్లి గ్రామంలో శుక్రవారం రైతు విశిష్ట సంఖ్య పొందడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ 11 అంకెల విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఇందుకోసం రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌లింక్ అయిన మొబైల్ నంబరు తీసుకురావాలని సూచించారు. ఈ విశిష్ట సంఖ్యను ఈ నెల 27వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం దీనిపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి రాజ్యలక్ష్మి, వ్యవసాయ సహాయకులు హరినాథ్, రైతులు పాల్గొన్నారు.

రైతులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య

పులిచెర్ల(కల్లూరు): భారత ప్రభుత్వం రైతులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇస్తోందని పుంగనూరు వ్యవసాయశాఖ ఏడి శివశంకర్ తెలిపారు. మండలంలోని పులిచెర్ల, మంగళంపేట, మతుకువారిపల్లె పంచాయతీల్లోని రైతు సేవా కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు పొందడానికి ఈ గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. రైతులు భూమి పాసుపుస్తకం, వన్-బి, ఆధార్‌తో లింకైన మొబైల్ నంబర్‌తో ఆర్ఎస్‌కేలో సంప్రదించాలన్నారు.

వైభవం.. వసంతోత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న వేణుగోపాల స్వామి

వి.కోట: పట్టణంలో వెలసిన శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. రాజస్థాన్ సమాజ్ వారి ఆధ్వర్యంలో ఉదయం వసంతోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. రాత్రి పట్టణానికి చెందిన సత్యనారాయణ వారి ఆధ్వర్యంలో చిత్రగోపురం నిర్వహించారు. అనంతరం రాజగోపాల్‌నాయుడి జ్ఞాపకార్థం వారి కుమారులు శయనోత్సవాన్ని నిర్వహించారు. మొదట స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి, రకరకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం స్వామివారిని ఉత్సవ మూర్తులుగా కొలువుదీర్చి ఉదయం, సాయంత్రం పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ పూజా కార్యక్రమంలో ఉభయదారులు, ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్త సీతారామయ్య పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

పుంగనూరు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నిమ్మనపల్లె మండలం చింతలవారిపల్లెకు చెందిన వెంకట్రమణ కుమారుడు అశోక్(35) పుంగనూరుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. పనులు ముగించుకుని తిరుగుప్రయాణంలో చదళ్ల గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి 108 ద్వారా క్షతగాత్రుడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటికే అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీడీవో లీలామాధవి

పుంగనూరు: రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యకే అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో లీలామాధవి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికల ద్వారా మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి సహకారంతో ముందుకెళతామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను గుర్తించి, వెనువెంటనే సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో హార్టికల్చర్ ద్వారా 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు డ్రిప్ సామగ్రి అందిస్తారని అధికారులు తెలిపారు. 5 ఎకరాల పైన ఉన్న రైతులకు 70 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లను అందిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీవో శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా 19 పనులు గుర్తించామని, అందులో 16 పనులు పూర్తి చేయడంతో పాటు రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. వైద్యాధికారులు ప్రతి గ్రామాన్ని సందర్శించి, ప్రతి కుటుంబంలో ఉన్న వారికి ఉచితంగా బీపీ, చక్కర వ్యాధి లక్షణాలు గుర్తించి సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సరోజమ్మ, ఈశ్వరమ్మ, ఈవోపీఆర్‌డీ నారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లీలామాధవి శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలన్నారు.

దామోదర సంజీవయ్యకు ఘన నివాళి

చౌడేపల్లె: మాజీ సీఎం దామోదర సంజీవయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని డీసీసీబీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సురేష్, నాయకులు డాక్టర్ చంద్ర, వేణుగోపాల్, శేఖర్, గంగాధరం, ఈశ్వర్ తదితరులున్నారు.

అమర వీరులకు శ్రద్ధాంజలి



వీరజవాన్లకు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

పులిచెర్ల(కల్లూరు): కశ్మీర్‌లోని పుల్వామ వద్ద 2019 ఫిబ్రవరి 14న తీవ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 40మంది వీర జవాన్లకు శుక్రవారం కల్లూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించినట్లు జిల్లా క్రీడా విభాగం అధ్యక్షుడు లయన్ మహమ్మదాలీ తెలిపారు. అమరవీరుల త్యాగాలను మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో లియోక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పారిశుధ్య పనులు

పలమనేరు: స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛాంధ్రలో భాగంగా నేడు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని సచివాలయాల్లో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను చేపట్టనున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు హాజరు కావాలని ఆయన సూచించారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో

గుడుపల్లె: మండలంలోని పాఠశాలను కుప్పం రెవెన్యూ డివిజినల్ అధికారి శ్రీనివాసరాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మండలంలోని కస్తూరిబా గురుకుల పాఠశాల, హాస్టళ్లను సందర్శించారు. అగరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీలు చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.

బోయకొండ రోడ్డుకు మరమ్మతులు





గుంతల మయంగా మారిన రోడ్డు(ఫైల్), బోయకొండకు వెళ్లే మార్గంలో ప్యాచ్ వర్క్ చేసిన రోడ్డు

చౌడేపల్లె: మండలంలోని లద్దిగం కొత్త రోడ్డు నుంచి బోయకొండకు వెళ్లే రోడ్డు కొలింపల్లె క్రాసు వరకు గుంతలమయంగా మారిందని, ప్రయాణికులు ప్రమాదాల పాలవుతున్నారని 'సాక్షి' పత్రికలో 'బోయకొండ రోడ్డు బాగుచేసేదెన్నడో' అన్న శీర్షికన ప్రచురితమైంది. దీంతో ఆర్అండ్‌బి అధికారులు స్పందించి గుంతల రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

ఉత్తమ ఫలితాల కోసమే నైట్ విజన్



విద్యార్థులకు సూచనలిస్తున్న జీవీ.రమణ

పుంగనూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల కోసమే నైట్‌విజన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు జీవి.రమణ తెలిపారు. నైట్ విజన్ క్యాంపెయిన్‌లో భాంగా గురువారం రాత్రి పట్టణ సమీపంలో ఉన్న మేలుందొడ్డి గ్రామాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పదోతరగతి పరీక్షలను ఎలా రాయాలో సూచనలు ఇచ్చారు. అలాగే టెన్త్ విద్యార్థులు ఉండే ఇళ్లల్లో నెలరోజుల పాటు టీవీలు ఆపి వేయడంతో పాటు, విద్యార్థులకు సెల్‌ఫోన్లు ఇవ్వరాదని సూచించారు. ప్రతిరోజూ ఉదయం 4 నుంచి 6గంటల వరకు తిరిగి రాత్రి 10 గంటల వరకు విద్యార్థులను చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తే ట్రిబుల్ ఐటీ, కార్పొరేట్ కళాశాలల్లో ఉచితంగా సీట్లు పొందే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుద్రాణి, ఉపాధ్యాయులు బుక్యారామ కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎన్‌సీడీ-సీడీ సర్వే చేయాలి



ఎన్సీడీసీడీ సర్వేలో ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటప్రసాద్

గంగవరం: ప్రతి గ్రామంలోని అన్ని ఇళ్లలో ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటప్రసాద్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. గంగవరం పీహెచ్‌సీ పరిధిలోని సాయినగర్‌లో జరుగుతున్న ఎన్సీడీ–సీడీ (నాన్ కమ్యూనికల్ డిసీజస్– కమ్యూనికల్ డిసీజస్) సర్వేను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో కలిసి నివాసాలను సందర్శించి అందిస్తున్న వైద్య పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రతి ఇంటినీ సందర్శించి ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్, అన్ని రకాల క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల రూపకల్పనే ధ్యేయం



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆర్డీవో భవాని

పుంగనూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల రూపకల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని పలమనేరు ఆర్డీవో భవాని అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లీనార్డ్ మున్సిపల్ హైసూల్క్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులను బోధన సామర్థ్యాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అధికశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రుద్రాణి, ఉషారాణి పాల్గొన్నారు.

ముప్పని తెలిసినా మారని తీరు



రేగడదిన్నేపల్లి వద్ద రోడ్డుపై పంట నూర్పిడి

శాంతిపురం: రహదారులపై పంట నూర్పిడి పనులు ప్రమాదకరమని తెలిసినా కొందరు రైతులు అదే పనిని కొనసాగిస్తున్నారు. కట్టడి చేయాల్సిన అధికారులు కళ్లకు నిర్లక్ష్యపు గంతలు కట్టుకోవటంతో వాహనదారులకు ప్రయాణం ఒక గండంగా సాగుతోంది. నూర్పిడి కోసం రోడ్డుపై పరచిన రాగి తాలు(గడ్డి), ఉలవ పంటపై ఏమాత్రం ఏమరుపాటుతో ద్విచక్ర వాహనాలు వెళ్లినా అవి అదుపుతప్పి పడిపోతాయి. తక్కువ ఎత్తు ఉన్న కార్లు వెళ్తే వేడిగా ఉన్న వాటి ఇంజిన్, సైలెన్సర్ భాగాలకు గడ్డి చుట్టుకుని మంటలు రేగుతాయి. ఈ నెల ప్రారంభంలో కర్ణాటకలోని సమీప ప్రాంతం నంగిలి వద్ద ఇలాగే ఓ కారు అగ్నికి ఆహుతి కావటం వార్తల్లో, సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. వి.కోట–కుప్పం జాతీయ రహదారిలో నూర్పిడి పనుల కారణంగా గతంలో ఓ మోటారు సైక్లిస్ట్ ప్రాణాలు కోల్పోయిన సంఘటన కూడా చోటు చేసుకుంది. అయినా అటు నూర్పిడి చేసే వారు, ఇటు అధికారులు మాత్రం స్పందించిన పాపాన పోలేదు. దీంతో రోడ్లపై నూర్పిడి చూస్తేనే వాహనదారులు భయం భయంగా ముందుకు సాగుతున్నారు. రహదారులు భవనాల శాఖతో పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు అధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.